సినిమా సమీక్ష :

# 'గాంధీ'

కలడు కలండనెడు వాడు కలడో లేడో అని
లోగడ ఒక ఏనుగు ఆలోచనలో పడిందట

అని శ్రీశ్రీ అన్నట్టు, మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ అనే వ్యక్తి ఈ ధరాతలం మీద నడిచాడని చెప్తే భావితరాల వాళ్ళు నిజమో కాదో అని విస్మయంలో పడతారని ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ అన్నాడట. మానవజాతి మీద గాని ఆ జాతి భవితవ్యం మీద గాని విశ్వాసలేశం వుందన్న అనుమానానికి గూడ తావివ్వని అల్డస్ హక్స్‌లీ హిమశీతల మేధస్సుకు గూడ, మోహన్‌దాస్ కరంచంద్‌గాంధీ 'మహాత్ముడే'నా అని అరడజను పేజీల పాటు తర్కించి చివరికి 'ఆయన మహాత్ముడు అయినా కాకున్నా, ఇతర సమకాలీన రాజకీయ నాయకులతో పోల్చిచూస్తే, ఆయన సుగంధాన్ని వెద జల్లుతూ నిష్క్రమించాడని చెప్పక తప్పదు' అని తీర్మానించక తప్పలేదు. (He left a clean smell behind అనే ఆంగ్ల నుడికారానికి ఇది స్వేచ్ఛానువాదమో వికట అనుసరణమో, ఉభయభాషజ్ఞులు తేల్చాలి). సుగంధాన్ని వెదజల్లడం అగరొత్తుల ధర్మమేగాని జాతినాయకుల పని కాదుకాబట్టి హక్స్‌లీ తీర్మానాన్ని ఒక విశేషంగా భావించకపోవచ్చు. అయినా, హక్స్‌లీ ఆంగ్లేయుడు కాబట్టి, మనమంతా ఆంగ్ల మానసపుత్రులం కాకున్నా చాలమంది ఆంగ్లభాషా పుత్రులం కాబట్టి, చెప్పుకోక తప్పదు. కనీసం అందుకోసమే అయినా సర్ రిచర్డ్ అటెన్‌బరో తీసిన 'గాంధీ' అనే పొడి అక్షరాల పేరున్న సినిమా గురించి మాట్లాడుకోక తప్పదు.

సర్ రిచర్డ్ అటెన్‌బరో ఎవరన్నది మనకు అనవసరం. ఆయన పేరు ముందున్న సర్ అన్న అలంకరణ పిత్రార్జితమా లేక పైరవీ చేయగా వచ్చిందా అన్నది గూడ మనకు అనవసరం. అతను 'గాంధీ' సినిమా ఎందుకు తీశాడన్నది మాత్రమే ప్రస్తుతం. సినిమా చూడకముందే నేనొక అవగాహనకు వచ్చాను. ఏ భావితరాలవాళ్ళు గాంధీ కలడో లేడో అని ఖచ్చితంగా విస్మయం చెందుతారని ఐన్‌స్టీన్ అన్నాడో, ఆ తరానికి - అంటే ఈ తరానికి - సంశయ నివృత్తి చేసి, చచ్చి దహన సంస్కారాలు జరిగిన అహింసా సిద్ధాంతాన్నీ, సత్యాగ్రహ మంత్రాన్నీ, మళ్ళీ పునరుజ్జీవింపజేసే సామ్రాజ్యవాదపు కుట్ర ఈ సినిమా అనుకున్నాను. గాంధీ మార్గం పట్ల నేటి యువతరంలో మళ్ళీ అపోహాలు కల్గించి, ఆనాడు మనదేశ దళారీ బూర్జువా వర్గానికి అధికారం మార్పిడి చేయడానికి గాంధీ ఏవిధంగా తోడ్పడ్డాడో

అదేవిధంగా ఆ అధికారం కొనసాగేందుకు ఈ కల్లోల తరంలో ఒక సామ్రాజ్యవాద సినీ నిర్మాత చేస్తున్న ఉడుతాసాయం ఈ సినిమా అనుకున్నాను. ఆ సహాయం ఎందుకు అవసరమయిందంటే, గాంధీ మార్గాన్ని సమర్థించేవాళ్ళు, హింసామార్గం బెంగాల్ టెరరిస్టుల వంటి కొద్దిమంది ఉద్రిక్తులను మాత్రమే కదిలించగలదు, అహింసామార్గం ఒక్కటే స్త్రీ పురుష భేదం లేకుండ జనసామాన్యాన్ని కదిలించ గలదనీ, అట్లా జనసామాన్యాన్ని కదిలించగల కిటుకును కనిపెట్టడం గాంధీ గొప్పతన మనీ, ప్రచారం చేస్తున్నారు. అయితే చైనా విప్లవం, ఆ మార్గంలోనే పయనించి ఘనంగా విజయవంతమయిన వియత్నాం, లావోస్, కంపూచియా, జింబాబ్వే, తదితర జాతి విముక్తి పోరాటాలు, ఈ వాదాన్ని అర్థరహితం చేసి, ప్రజాపంథా గనక వుంటే సాయుధ పోరాటం లక్షలాది మంది ప్రజలను కదిలించగలదని ఋజువు చేసాయి.

సినిమా చూడడంతో ఆ అవగాహన తారుమారయింది. తారుమారు కావడంతో ఒక మౌలికమయిన గతితార్కిక భౌతికవాద సూత్రం గూడ ఋజువయింది. వాస్తవాలకు తర్కాన్ని జోడించి సిద్ధాంతాన్ని నిరూపించి సంపన్నం చేయడం సరయిన పరిశీలనా పద్ధతి అవుతుంది గాని, ఆ క్రమాన్ని తలమీద నిలబెట్టి సిద్ధాంతం నుండి తర్కం ద్వారా వాస్తవాలను నిర్ధారించే ప్రయత్నం అశాస్త్రీయం.

తారుమారు ఎందుకయిందంటే, ఈ సినిమా చూసిన వారెవ్వరికీ గాంధీ అన్నా, అహింసా మార్గమన్నా, కాంగ్రెస్ పార్టీ నడిపిన జాతీయ ఉద్యమమన్నా, గౌరవం కలగదు. ఇదెక్కడి ఉద్యమం, వీళ్ళేం నాయకులు, అనిపిస్తుంది. ఉప్పు సత్యాగ్రహాన్ని జాతీయ చైతన్యాన్ని మేల్కొలిపిన ఒక ఘనమయిన ఉద్యమంగా పొగడగా చిన్నప్పుడు స్కూల్లో చదువుకున్న వాళ్ళకు ఆ సత్యాగ్రహం సీనుచూస్తే సిగ్గనిపిస్తుంది. బలిపశువుల్లాగా ఒక్కొక్కసారి అయిదేసిమంది పోలీసుల చేతులలోకి పోవడం, ప్రతిఘటించకుండా లాఠీదెబ్బలు తినడం, పక్కనే రెడీగావున్న వాళ్ళ భార్యలూ చెల్లెల్లూ తల్లులూ (ఇక్కడ గూడ వాళ్ళు సేవికలే) వెంటనే పడిపోయిన వాళ్ళను లేవదీసి పక్కకు తీసుకపోయి కట్లు కట్టడం మళ్ళీ మరొక అయిదుమంది వధ్యస్థలానికి బెదురుతూ ముందుకు రావడం,.... చూస్తుంటే అహింస పేరిట ఆడుతున్న ఫార్సు అనిపిస్తుంది జట్లుజట్లుగా వెళ్ళి దెబ్బలుతిని కట్లు కట్టించుకోక పోతే. ఒక్కుమ్మడిగా అందరూ తిరగబడితే కాల్పులు జరిగి ఇద్దరు ముగ్గురు

ప్రాణాలు కోల్పోయినా లక్ష్యం నెరవేరుతుంది గదా అన్న సందేహం ఎటువంటి వారికైనా రాకమానదు.

మరి అహింసామార్గం పట్ల గౌరవం కలిగించలేకపోతె, అట్టెన్‌బరో ఈ సినిమా ఎందుకు తీసినట్టు ? సమాధానం కావాలంటే సినిమాలో ఏముందో ఏం లేదో ఒకసారి గమనిద్దాం. మొత్తం సినిమాలో భారతదేశస్తుల పాత్రచిత్రణ ప్రేక్షకులను ఆకర్షించేటట్టు లేదు. గాంధీ నుండి జిన్నా వరకు ఎవ్వరూ దీనికి మినహాయింపు కాదు. భారతదేశ చరిత్ర తెలియని వాళ్ళకు ఈ సినిమా చూపించి, అందరికంటే బలమయిన వ్యక్తిత్వం గల మనిషిగా కనబడ్డది ఎవ్వరంటే, గాంధీ కాదు, నెహ్రూ కాదు, 'ఉక్కుమనిషి' సర్దార్ పటేల్ కాదు, చార్లెస్ అండ్రూస్ అని సమాధానం చెబుతాడు. గాంధీని ఒక మహాత్ముడిగా కాక 'మామూలు మనిషి'గా చూపించే ప్రయత్నంలో వెర్రిబాగులవాడిగా చూపించాడు. నెహ్రూను వర్ణించాలంటే, హైదరాబాదీ నుడికారంలో, 'హాలా' లాగా ఉన్నాడు. సర్దార్ పటేల్, పగలంతా ఆఫీసులో ఫ్యాను క్రింద శ్రమించి సాయంకాలం క్లబ్బులో టెన్నిసో పేకముక్కలో ఆడుకునే చీకూ చింతా లేని బ్యాంకు మానేజర్ లాగున్నాడు. ఆజాద్ వల్లకళ్ళద్దాలూ పిల్లి గడ్డమూ నోటినిండా నవ్వూ చూస్తే నవాబ్‌ఖాన్‌దాన్‌లో పుట్టిన విలాస పురుష డనిపిస్తుంది. మహమ్మద్ అలీ జిన్నా హిందీ సినిమా విలన్‌లాగున్నాడు (మొదటి 15 రీళ్ళు ఘరానా వ్యాపారస్తుడిలా కనబడి, ఆఖరి రీలులో అసలు విలన్‌గా బయట పడతాడు చూడండి, ఆ రకం).

అయ్యో, మన జాతీయ నాయకులను ఇంతగా అగౌరవపరిచాడే అని బాధపడాల్సిన అవసరంలేదు. నిజానికి వీళ్లెవ్వరూ ఇంతకంటే గౌరవానికి అర్హులు కారు. కాని విషయం అది కాదు. అట్టెన్‌బరో ఈ సినిమాను ఎందుకు తీసాడన్నది విషయం.

సినిమాను ఇంకొంచెం లోతుగా పరిశీలిద్దాం. గాంధీ అనగానే మన కందరికీ గుర్తుకొచ్చేది, ఆయనగారు చిన్నప్పుడు దొంగతనంగా తిన్న మేక మాంసం, కాల్చిన ఎంగిలి బీడీ. ఆ విషయాలు సినిమాలో లేవు. (ఇదేదో కుట్ర అని నా అభిప్రాయం కాదు, విషయం చెప్తున్నాను). సినిమా దక్షిణాఫ్రికాలో ప్రారంభ మవుతుంది. అక్కడి భారతీయుల మీద దక్షిణాఫ్రికా ప్రభుత్వం విధించిన ఆంక్ష లకు వ్యతిరేకంగా గాంధీ ఒక ఉద్యమం నడుపుతాడు. ప్రభుత్వం మంజూరు చేసిన పాసులను కాలబెడతాడు. కొడితే దెబ్బలు తింటాడు. మీటింగులు పెట్టి తడబడుతూ

మాట్లాడకూడదు. పోలీసులు కొట్టినాసరే ఎదురుతిరగకూడదనీ, హింసకు ప్రతిహింస సమాధానం కాదనీ, చెప్తాడు. మీటింగు ఒక గ్యాలరీవున్న హాలులో జరుగుతుంది. ఉద్యమం స్వభావానికి అనుగుణంగానే, హాలు క్రింది భాగంలో పురానా వ్యక్తులు కూర్చుంటారు. గ్యాలరీలో కూలివాళ్ళు కూర్చుంటారు. ఒక్క కూలిఅతను మాత్రం కొంత అసంతృప్తి కనబరుస్తాడుగాని, త్వరలో అతనితోబాటు అక్కడున్న వాళ్ళంతా 'హిప్నొటైజ్' అయినట్టు గాంధీని అనుసరిస్తారు. గాంధీ తృప్తిగా గాలి పీల్చుకుంటాడు. గాంధీని మహాత్ముడిగా కాక ఒక మామూలు మనిషిగా, చాలా స్వాభావికంగా చిత్రీకరించాడని చాలమంది అట్టెన్‌బరోను మెచ్చుకున్నారు. అయితే ఈ క్రమంలో తక్కిన వాళ్ళందరినీ గూడ (తెల్ల వాళ్ళను మినహాయిస్తే) స్వాభావికంగా గాని, మామూలు మనుషులగాగాని కాక, గాంధీచుట్టూ పరిభ్రమించే మరబొమ్మలుగా చిత్రీకరించాడన్న విషయం ఎవరికంటా పడలేదు. దక్షిణాఫ్రికా నుండి భారత దేశానికి గాంధీ తిరిగివచ్చే సీను గూడ దీనికి అనుగుణంగానే వుంది. దేశంలోని 'జాతీయ నాయకు' లందరూ గాంధీ పాదాల దగ్గర విల్లమ్ములు పడేసి అస్త్రసన్యాసం చేసి ఇక నీదే ఈ ఉద్యమ నాయకత్వం అని దండం పెట్టినంత పనిచేస్తారు. గాంధీకి మాత్రం ('మామూలు మనిషి' గనుక) ఎటూ పాలుపోదు, రైలెక్కి దేశమంతా తిరిగి వస్తాడు. ఎందుకంటే, 'అసలు' ప్రజల్ని కలవడం కోసం. (మొన్ననే గదా, గాంధేయ మాజీ సోషలిస్టు 'ఠాకూర్' చంద్రశేఖర్ అదే ఉద్దేశ్యంతో కన్యాకుమారి దగ్గర బయలుదేరి ఊరూరా తిరుగుతున్నాడు! పాత వాసన ఇంకా పోలేదు.) కలిసిన ప్రజలలో దైన్యమే తప్ప పోరాటం కనుపించలేదు కాబట్టి ధైర్యంచేసి సహాయనిరాకరణా, సత్యాగ్రహం, వగైరా ప్రకటిస్తాడు గాంధీ. హింస నైతికంగా తప్పనీ, అహింసే మన మార్గమనీ నిషేధం పెడతాడు. ప్రజలు ఆ నిషేధాన్ని పాటించక చౌరీచౌరాలో పోలీసుస్టేషన్‌ను కాలబెట్టి పోలీసులను చంపితే ఉద్యమాన్ని విరమించుకుంటాడు. ఇది తెలిసిన కథే. ఉద్యమ విరమణ గురించి ఆనాడు తక్కిన కాంగ్రెస్ నాయకులు ఏమనుకున్నారో తెలీదుగాని, సినిమాలో మాత్రం 'కిం' అనరంటే అబద్ధమవుతుంది గానీ, అంతకంటె ఎక్కువమాత్రం అనరు. ఒక్క జిన్నా మాత్రమే గాంధీ వాదస్థాలపట్ల అసంతృప్తి కనబరుస్తాడు (విలన్ కదా మరి). మిగిలినవాళ్ళంతా సమ్మోహనాస్త్రం ప్రయోగించినట్టు గాంధీని అనుసరిస్తారు. అటు తరువాతి చరిత్ర అంతా (దండి, చంపారన్, సత్యాగ్రహాలను మినహాయిస్తే) గాంధీ రాట్నంతో నూలు వడకడం, ఆశ్రమంలో మేకపిల్లకు నాటువైద్యం చేయడం, తనను

దర్శించుకోవడానికి వచ్చిన పాశ్చాత్య పాత్రికేయులకు తన అహింసా సత్యాగ్రహాల సిద్ధాంతాన్ని వివరించడం, వెరసి ఒక వైరాగ్యశీలవాడిగా, చర్చిల్ మాటల్లో చెప్పాలంటే గోచిపాత సన్యాసిగా (half naked fakir), ప్రవర్తించడం. తక్కిన 'జాతి నాయకు'లంతా గాంధీ ఆశ్రమంలో ఆ మహాత్ముడి ఆజ్ఞలకోసం ఎదురుచూస్తూ పడిగాపులు కాస్తారు. మొదట్లో ఆశ్రమానికి రావడం అందరూ అదేదో వనభోజనానికన్నట్టు వస్తారు. వచ్చిన తరువాత రాజకీయాల సంగతి దేవుడెరుగు, నూలు వడకడం గూడ నేర్చుకున్నట్టు కనబడరు. గాంధీ వైరితనాన్ని వైరినవ్వులతో సహిస్తూ కూర్చుంటారు. చైనా వియత్నాం తదితర దేశాల విముక్తి పోరాట కథలతో పరిచయం ఉన్నవాళ్ళు, ఇది ఏ జాతి అయినా గర్వించదగ్గ జాతీయోద్యమమా అని ప్రశ్నించుకోక తప్పదు.

మరయితే మన ప్రశ్న ఇంకా అలాగే వుండిపోయింది. అట్టెన్‌బరో ఈ సినిమా ఎందుకు తీసినట్టు ? రెండుమూడేళ్ళ క్రితం ఆంగ్ల మానస పుత్రులయిన భారతీయులలో ఇంతకు సహంగా దుమారం రేపిన కొలిన్స్, లాపియర్ ల Freedom at midnight అనే పుస్తకాన్ని గుర్తు తెచ్చుకుంటే అర్థమవుతుంది. ఆ పుస్తకానికీ ఈ సినిమాకూ వెనకున్నది శ్వేతజాతి దురహంకారం కాకున్నా శ్వేత జాతి ఔన్నత్య భావం. ఆ ఔన్నత్య భావం నల్లవాళ్ళను ద్వేషించదు పురానా గృహిణులు పిల్లలనూ, బొచ్చుకుక్కలనూ ప్రేమించినట్టు ప్రేమిస్తుంది. వాత్సల్య భావం ఇంగ్లీషులో (patronising attitude) దాని స్వభావం. చూసారా ఈ నల్ల వెధవలు ఎంత తెలివయిన వాళ్ళో అని మురిసిపోతుంది. చర్చిల్ అహంకారంతో గాంధీని గోచిపాత సన్యాసి అన్నాడు. ఆ అహంకారం అట్టెన్‌బరోలో మురిపెంగా మారి సినిమాలో చార్లెస్ ఆండ్రూస్ రూపం తీసుకుంది. గాంధీని మహాత్ముడిగా కాక 'మామూలు మనిషి'గా చూపే ప్రయత్నం వెనక ఉన్నది అదే. తనకు ముచ్చటగా అనిపించిన ఈ నల్లవాళ్ళ నిర్వాకాన్ని చిత్రీకరించి సాటి తెల్లవాళ్ళ ముందు అట్టెన్‌బరో ప్రదర్శించదల్చుకున్నాడు. అమ్ముడుపోతోంది కాబట్టి మనదేశంలో గూడ అమ్ముతున్నాడుగాని, ఇది మనకు చూపించడానికి తీసిన సినిమా కాదు.

అయితే భారత జాతీయ ఉద్యమాన్ని ఇట్లా మురిపెంగా చిత్రించడంలో కొంత ఇబ్బంది వుంది. ప్రజలందరూ గోచిపాతరాయుళ్ళయితే కావచ్చుగాని గాంధీ లాగ బోగస్ ఫకీర్లు కారు. నాయకులలో గూడ నెహ్రూవంటి వాళ్ళు పాశ్చాత్యుల కళ్ళకు ముద్దొచ్చే మంచి బాలురగా కనబడవచ్చుగాని, అందరూ అట్లాంటి వాళ్ళుకారు.

అందుకే ఈ సినిమాలో నెహ్రూ, పటేల్, అజాద్‌లను చూపించాడుగాని సుభాష్ బోసునో, అంబేద్కర్‌నో, జయప్రకాశ్ నారాయణ్‌నో చూపించలేదు (కాంగ్రెస్ నాయకుల సంగతే మాట్లాడుకుందాం, ఇతరులను అట్టెన్‌బరో ఎట్లాగూ చూపించబోడు). అహింసాత్మకంగా మొదలయి ముగిసిన దండి సత్యాగ్రహం, చంపారన్ సత్యాగ్రహం కనబడతాయి గాని, రైలుపట్టాలనూ కరెంటుతీగలనూ ఊడబీకి రోడ్లనూ బ్రిడ్జీలను ధ్వంసంచేసిన క్విట్ ఇండియా ఉద్యమం ప్రసక్తే లేదు. ప్రజలంటారా, 'మహాత్మాగాంధీకీ జై' అనడం తప్ప వారికి వేరే పాత్రలేదు. చివరికి పాత కాంగ్రెస్ నాయకులలో గూడ గోఖలే కనబడతాడుగాని తిలక్ కనబడడు. అహింస ముద్దొచ్చినట్టు హింస ముద్దురాదు.

ఒక రకంగా ఇందులో అసంకల్పిత వ్యంగ్యం ఉంది. అట్టెన్‌బరో శ్వేతజాతి ఔన్నత్య భావానికి కాంగ్రెస్ ఉద్యమం లక్కపిడతల ఆటలాగా కనిపించింది. దానిపట్ల తనకున్న మురిపాన్ని వ్యక్తీకరించడానికి సినిమాలో ప్రతీసీనులోనూ ప్రేక్షక స్థానంలో ఒక తెల్లమనిషిని ప్రవేశపెడతాడు. మొదటి సగంవరకు చార్లెస్ ఆండ్రూస్, ఆ తరవాత మీరాబేన్, తరువాత ముగ్గురు పాశ్చాత్య పత్రికా విలేఖరులు, ఈ స్థానంలో వుండి శ్వేతజాతి ప్రతినిధులుగా ఆ ఆటను చూసి ఆనందిస్తారు. ఇందులో వ్యంగ్యం ఎక్కడుందంటే, ఇదంతా బహుశా న్యాయమే కావచ్చు. కాంగ్రెస్ ఉద్యమం నిజంగానే లక్కపిడతల ఆటలాగా నడిచి ఉండవచ్చు, అట్లాఅని అట్టెన్‌బరో సీరియస్‌గా వాదిస్తే మనకు అభ్యంతరం ఉండకపోవచ్చు. కాని మనం ఆ సత్యాన్ని శ్వేతజాతి దురహంకారంద్వారా తెలుసుకోవాల్సిరావడం బాధాకరం.

—బి. జి.

## కొత్త పుస్తకాలు

అనామకుడి డైరీ

....కె. రాంమోహన్‌రాజు కథల సంపుటి రూ. 5/–

సముద్రం

....వరవరరావు రూ. 2/–

గ్రామాలు మేల్కొంటున్నాయి

....నాటకాలు - నాటికలు రూ, 8/–